GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

T MEDIA టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం


మెయిన్


సంపుటి : 7 సంచిక : 260 ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ గురువారం 20-03-2025 పేజీలు : 3





# భట్టి బడ్జెట్

# రూ.3,04,965 కోట్లు






## రెవెన్యూ వ్యయం - రూ.2,26,982 కోట్లు

## సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత

**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పద్దును ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి రాష్ట్ర తలసరి ఆదాయం, అప్పులు, రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయంపై మాట్లాడారు. ఈసారి సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. రాష్ట్రం అప్పులు రూ.5,04,814 కోట్లుగా ఉంది. శాసనసభలో మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం 1.43 గంటల పాటు సాగింది.గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని అభిప్రాయపడ్డారు. మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు.హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు నిధులు : హైదరాబాద్‌లో సమగ్ర వరద నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.5,942 కోట్లు కేటాయిస్తామని బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దేశానికే తలమానికంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నామన్నారు. ఓఆర్ఆర్ ఫేజ్-2 నీటి సరఫరా ప్రాజెక్టు చివరి దశకు చేరుకుందని వివరించారు. ఫేజ్-2 ద్వారా హెచ్ఎండీఏలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీరు అందిస్తామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్య ఉంటుందని వెల్లడించారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందిస్తామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

### మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు


చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి భట్టి తెలిపారు. ప్రతి మండలంలో మహిళలతో రైస్? మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తామన్నారు. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తామని చెప్పారు. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తామని వివరించారు. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తామని వెల్లడించారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణ. అని మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో వివరాలు వెల్లడించారు.

## ఎస్సీ వర్గీకరణలో భాగం

# 15 % రిజర్వేషన్లు

### తీర్మానం పెట్టాలని 2014లో అసెంబ్లీలో చెప్పా

### -సీఎం రేవంత్ రెడ్డి



**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో** : ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.బిల్లును ఎవరూ వ్యతిరేకించే సాహసం చేయలేదు : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఏళ్లుగా వాయిదా పడుతున్న కేసులో బలమైన వాదనలతో అత్యున్నత న్యాయస్థానాన్ని మెప్పించామని అన్నారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న చోట కూడా ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని, ఎస్సీ వర్గాలకు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడైనా న్యాయం చేయాలని బలంగా నమ్మానని, సమన్వయం చేసుకుంటూ అసెంబ్లీలో అందరినీ కూడగట్టామని తెలిపారు. బిల్లును ఎవరూ వ్యతిరేకించే సాహసం చేయలేదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా 15 % రిజర్వేషన్లు కేటాయించామని, ఎస్సీల్లో గ్రూప్-1కు ఒక శాతం, గ్రూప్-2కు 9 %, గ్రూప్-3కు 5 % రిజర్వేషన్లు కల్పించామని, అతి తక్కువ జనాభా కలిగి అభివృద్ధి ఫలాలు ఆశించిన వారిని గ్రూప్-1లో ఉంచామని వివరించారు.ఆయనతో వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయి : ఎస్సీ వర్గీకరణ తీర్మానం పెట్టాలని 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక శాసన సభలో చెప్పానని, దీనిపై కేంద్రానికి తీర్మానం పంపాలని కోరామని, తీర్మానం ప్రవేశపెడితే తనతో పాటు సండ్ర వెంకట వీరయ్య, సంపత్‌ను సభ నుంచి బహిష్కరించారని సీఎం గుర్తు చేశారు. తాము పెట్టిన తీర్మానాన్ని విధిలేని పరిస్థితుల్లో ఆనాడు సభ ఏకగ్రీవంగా ఆమోదించాల్సి వచ్చిందని అన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని ఏనాడూ తీసుకెళ్లలేదని, మందకృష్ణతో ఎలాంటి విభేదాలు లేవని, వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తమకంటే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆయన ఎక్కువగా నమ్ముతున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్న చోట ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని తెలిపారు.

## గల్ఫ్ వెళ్లినా...

# అప్పులతోనే సావాసం

- అవగాహన లేకపోవడమే కారణం

-పెరుగుతున్న ఏజెంట్ల మోసాలు



**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో :** ఉపాధికి విదేశాల బాటపట్టిన వలస జీవుల కష్టాలు తీరడంలేదు. దశాబ్దాలుగా ఏజెంట్ల మోసాలకు గురికావడం, ప్రమాదాల్లో గాయపడటం, మరణించటం, అప్పులు వేదనతో గుండెపగిలి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవటం వంటి ఎన్నో విషాదాలు నేటికి చోటు చేసుకుంటూనే ఉన్నాయి.ఉమ్మడి కరీనగర్ జిల్లాకు చెందిన దాదాపుగా 2.10 లక్షల మంది యూఏఈ, బెహరాన్, కువైట్, ఒమన్, ఖతర్, సౌదీ అరేబియా తదితర దేశాల్లో ఉపాధి నిమిత్తం జీవనం సాగిస్తున్నారు. ఉపాధి అవకాశాలకు యువత విదేశాలవైపు ఆకర్శితులవుతుండగా దాన్నే ఆసరాగా తీసుకుంటున్న ఏజెంట్లు వీరిని సులువుగా మోసం చేస్తున్నారు. సందర్శక వీసాలపై వెళ్లినవారు అక్కడ పని లభించక పట్టుబడి జైలు జీవితాన్ని అనుభవించాల్సి వస్తోంది.

### వారికి తీవ్ర ఇబ్బందులు

కంపెనీల్లో పని చేసినవారు మరణించినా, గాయపడినా సదరు కంపెనీనే భరిస్తుండగా, ఇతరత్రా పనులు చేసేవారు, సక్రమమైన వీసా లేనివారు చనిపోయినా, గాయపడినా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మృతదేహాన్ని తీసుకురావడానికి రూ.2 లక్షల ఖర్చు అవుతుండగా అక్కడివారే తలా ఇంత పోగేస్తుండటం దయనీయ స్థితికి అద్దం పడుతోంది.

### జైలు పాలు అవుతున్నారు

కొన్ని దేశాల్లో మూడు నాలుగేళ్లకోసారి క్షమాభిక్ష (అమ్నెస్టీ) ప్రకటిస్తారు. ఆ సమయంలో అక్రమంగా నివాసం ఉన్నవారు ఆ దేశం విడిచి వెళ్లిపోవాలి. కష్టిస్తే తప్ప పూట గడవని కష్టజీవులు అమ్నెస్టీ సమయంలో ఇంటికి ఎలా రావాలో తెలియక, ఎలాంటి సహాయం

మిగతా 3లో..

## సీఎం రేవంత్ రెడ్డిపై కేసు కొట్టివేత

### నాడు అరెస్ట్ చేసి రిమాండ్‌కు




**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో :** రేవంత్ రెడ్డిపై 2020లో నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. మాజీ మంత్రి కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై డ్రోన్ ఎగురవేశారంటూ రేవంత్ రెడ్డితో పాటు మరికొంత మందిపై నార్సింగి పీఎస్‌లో 2020 మార్చిలో కేసు నమోదైంది. అప్పుడు ప్రతిపక్షంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

### నిషేధిత ప్రాంతంలో లేదు

రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జన్వాడ నిషేధిత ప్రాంతమేమి కాదని, సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని ధర్మాసనానికి తెలిపారు. డ్రోన్ ఎగురవేసిన ప్రాంతం ఎటువంటి నిషేధిత జాబితాలో లేదని పీపీ న్యాయస్థానానికి వివరించారు. దీంతో పూర్తి వాదనలు విన్న న్యాయస్థానం నార్సింగి పీఎస్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులను వెలువరించింది.

### కేటీఆర్‌పై నమోదైన కేసు కొట్టివేత

మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కూడా కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ రెడ్డిని కించపర్చే విధంగా మాట్లాడారని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడంతో దానిని కొట్టేయాలని మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

### ఇష్టారీతిన మాట్లాడారు

విచారణ సందర్భంలో బాధ్యత గల హోదాలో ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ ఇష్టారీతిన మాట్లాడారని, సీఎంను కించపరిచే విధంగా మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. రాజకీయ కక్షల కారణంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేశారని ఆయన తరఫున న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ఇటీవల ఫార్ములా ఈ రేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ ఏసీబీ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. పలుమార్లు విచారణకు పిలిచి ఆయన నుంచి పోలీసు ఉన్నతాధికారులు వాంగ్మూలాలను సేకరించారు.

## అభివృద్ధి, సంక్షేమ, సేవారంగా ప్రగతిశీల బడ్జెట్

-ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** మల్లు భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమ, సేవారంగా, ప్రగతిశీల బడ్జెట్ అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు.బుధవారం డా. బీ ఆర్ అంబేద్కర్ సచివాలయం మీడియా సెంటర్ లో చిన్నారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ ప్రగతికి బాటలు వేస్తుందని, అభివృద్ధి, సంక్షేమ రంగాలకు సమపాళ్ళలో నిధుల కేటాయింపులు జరిగాయని చిన్నారెడ్డి పేర్కొన్నారు.సేవా రంగానికి సింహ భాగం ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని, వృద్ధి రేటు గణనీయంగా సాధించామని, తలసరి ఆదాయం 1.8 శాతం పెరిగిందని చిన్నారెడ్డి అన్నారు.విద్యా, వైద్యం, వ్యవసాయం, నీటి పారుదల, విద్యుత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పట్టణాభివృద్ధి రంగాలకు బడ్జెట్ లో పెద్ద పీట వేశారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. జీ ఎస్ డీ పీ 10.1 శాతం నమోదు కావడం గొప్ప విషయం అని అన్నారు. బడ్జెట్ ను విశ్లేషణ చేస్తే ఫ్యూచర్ సిటీ, మూసి సుందరీకరణ, హైదరాబాద్ మహా నగరంగా అభివృద్ధి చెందడం ఖాయమని చిన్నారెడ్డి తెలిపారు.

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ



**టీ మీడియా, మార్చి 19,వనపర్తి బ్యూరో :** రోజురోజుకు ఎండ వేడిమి ఎక్కువ వుతున్నందున కొత్తకోట చౌరస్తాలోని చెప్పులు కుట్టే వారికి , చిరు వ్యాపారులకు జె.ఎస్.ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు అభయ ఫౌండేషన్, హైదరాబాద్ వారి సహకారంతో గొడుగులు అంద జేశారు. ఎండాకాలంలో జీవనోపాధి నిమిత్తం రోడ్ల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించే వారికి ఎండ వేడి నుండి కాపాడుకునేందుకు తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జె.ఎస్.ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జె. సతీష్ రాజు,జె.కర్ణ కుమార్, జె.వి.సతీష్ ,జె. ఇజ్రాయిల్, జె.కళ్యాణ్, జె. అనిల్ తదితరులు పాల్గొన్నారు.


## విద్యకు 15% నిధులు కేటాయించాలి

-టీఎస్యుటీఎఫ్ డిమాండ్



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15% హామీకి ఆమడదూరంలో కేటాయింపు.విద్యకు 15% నిధులు కేటాయించాలి అని టీఎస్యుటీఎఫ్ డిమాండ్చేస్తుంది. ఈ సంవత్సరం రూ 304, 965 కోట్ల బడ్జెట్లో విద్యకు కేటాయించింది రూ 23108 కోట్లు (7.57%).గత సంవత్సరం రూ 274058 కోట్ల బడ్జెట్ లో విద్యకు కేటాయించింది. రూ 21292 కోట్లు (7.77%)అంకెల్లో రూ 1816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ శాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే తగ్గింది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26067 పాఠశాలలను గాలికొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నది.గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమే. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 16 లక్షలు. వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు బాలికలు. వీరికి నాణ్యమైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవు.విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, మెరుగైన మధ్యాహ్న భోజనం అందించేందుకు, నాణ్యమైన విద్యను అందించడానికి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యకు 15% నిధులు కేటాయించాలని టిఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేస్తోంది.అని డి కృష్ణయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, వనపర్తి తెలిపారు .

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



**టి మీడియా, మార్చి 19, పినపాక ప్రతినిధి:** బూర్గంపాడు మండలం, భద్రాచలం క్రాస్ రోడ్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణ సాగర్ లో ఐటిఐ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి చైతన్య అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన వ్యక్తిని భద్రాచలం హాస్పిటల్ కు తరలించారు. మృతుడు ముసల మడుగులోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలోని ఇంట్లో మరొక మిత్రుడితో కలసి కిరాయికి ఉంటున్నారు.బూర్గంపాడు ఎస్ఐ రాజేష్ ప్రమాద స్థలానికి చేరుకుని, లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విశ్వ నగరాభివృద్ధిని బడ్జెట్ లో పూర్తిగా విస్మరించారు

-బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపి.వివేకానంద్



**టీ మీడియా, మార్చి 19, మేడ్చల్ :** తెలంగాణ బడ్జెట్ సమావేశంలో భాగంగా బుధవారం రోజు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్లో మహానగరాభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ మహానగరాన్ని నలుమూలల అనుసంధానం చేస్తూ ఎంతోమంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చే హైదరాబాద్ మెట్రో కు బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. హైదరాబాద్ నగరానికి ప్రతి సంవత్సరం పదివేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నా మాటలు చెప్పడానికే కానీ చేతల్లో ఉండవని మరో మారు నిరూపిస్తూ హైదరాబాదు నగరానికి నిధులు కేటాయించకపోవడం నగరవాసులను తీవ్రంగా అవమానించడమే. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టి పూర్తిచేసిన ఎస్ఎన్డిపి, ఎస్.ఆర్.డి.పి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పుకోవడం సిగ్గుచేటు.తెలంగాణను పూర్తి ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా మార్చేందుకు మా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో శంకుస్థాపన చేపట్టిన మల్టీస్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు. దీంతో నిరుపేదలకు అందాల్సిన వైద్యం మరింత ఆలస్యం కానుంది.బడ్జెట్లో ఉన్న నగరాన్ని విస్మరించి ముఖ్యమంత్రి ఊహల నగరమైన ఫ్యూచర్ సిటీ కేంద్రంగా నిధుల కేటాయింపు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రజలను మోసం చేయడానికి ఒక ఎత్తుగడ మాత్రమేగానీ, అభివృద్ధి సంక్షేమం గురించి కాదు.

## అంబులెన్స్ లను తనిఖీ చేసిన రాష్ట్ర క్వాలిటీ ఆడిట్ ఆర్ కిషోర్



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** అల్లంపూర్ మార్కెట్ యార్డ్ లో ఉన్న 108 అంబులెన్స్ ను తనిఖీ చేసిన రాష్ట్ర క్వాలిటీ ఆడిటర్ కిషోర్ ,108 డిస్టిక్ కో ఆర్డినేటర్ బి రత్నమయ్య పని విధానంలో క్వాలిటీ గురించి బుధవారం మనోపాడు, అలంపూర్, ఉండవల్లి 108 అంబులెన్స్ లోని రికార్డులు పరిశీలించడం జరిగింది. అలాగని ఆక్సిజన్ , మెడికల్ ఎక్విప్మెంట్ , మెడిసిన్స్ చెక్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా అల్లంపూర్ మండల ప్రజలందరూ అత్యవసర పరిస్థితుల్లో 108 కాల్ చేసి వినియోగించు కోవాల్సిందిగా కోరడమైనది.108 అంబులెన్స్ 24 గంటలు అల్లంపూర్ మార్కెట్ యార్డ్ లో దగ్గర అందుబాటులో ఉంటుంది.108 కి కాల్ చేసిన ప్రతి ఒక్కరికి దగ్గరకు మా సిబ్బంది తక్షణమే బయలుదేరి 10 నుంచి 15 నిమిషాలలో సేవలందించడానికి సిద్ధంగా ఉన్న 108 అంబులెన్స్ ఈ కార్యక్రమంలో ఈఎంటి రాధ మోహన్, శేఖర్,రేణుకా,శివ, పైలెట్ కృష్ణ, దేవేందర్, రవి,రాజు,నరేష్ పాల్గొనడం జరిగింది.

# పెట్రోల్ బంకుల్లో ఈ ఉచిత సేవలు

## కల్పించకపోతే ఫిర్యాదు చేసే అవకాశం

**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో:** బంకులో ఓ వ్యక్తి పెట్రోల్ పోయించి కొద్ది దూరం వెళ్లగానే బైక్ మొరాయించింది. పెట్రోల్ నాణ్యత లేదని గుర్తించి వెంటనే బంకుకు వచ్చి యజమానిని నిలదీశాడు. ఆ యజమాని నుంచి నిర్లక్ష్య సమాధానం రావడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియలేదు. ఇప్పటికీ చాలా మందికి బంకుల్లో లభించే మౌలిక సదుపాయాల గురించి అస్సలు అవగాహన లేదు. ఆయా బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొట్టించినా, లేకపోయినా ఈ సౌకర్యాలను ఉచితంగా పొందవచ్చు. బంకుల్లో ఈ సౌకర్యాలు లేకుంటే పెట్రోలియం సంస్థలకు వెంటనే ఫిర్యాదు చేయొచ్చు.

**ప్రథమ చికిత్స కిట్**

పెట్రోల్ బంకులో ప్రధానమైన సదుపాయం ప్రథమ చికిత్స కిట్. కిట్లోని వైద్య పరికరాలను, ఔషధాలను ఎప్పటికప్పుడు మార్చడం తప్పనిసరి.స్వచ్ఛమైన తాగునీరు: దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు చాలా ప్రాంతాల్లో నీటి సౌకర్యం లభించదు. ఇక వేసవి కాలంలో అయితే చెప్పనవసరం లేదు. తాగు నీటిని కచ్చితంగా ఏర్పాటు చేయాలి. అందుకు బంకు యజమాని క్వాలిటీ కలిగిన ఆర్వో యంత్రం, నీటి సదుపాయం ఏర్పాటు చేస్తారు.

**మరుగుదొడ్లు**

బయట శౌచాలయాలు లేక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా అన్ని బంకుల్లో శుభ్రతమైన వాష్రూమ్స్ ఉండాలి.

**ఫోన్ సౌకర్యం**



అత్యవసర సమయాల్లో ఫోన్ చేసుకునేందుకు పెట్రోల్ బంకుల్లో సదుపాయం ఉంటుంది.

**వాహనాలకు ఉచిత గాలి**

వినియోగదారుల వాహనాల టైర్లలో గాలి నింపడానికి, తనిఖీ చేసుకోవడానికి తప్పనిసరిగా సంబంధిత మిషన్ ఉండాలి. ఓ వ్యక్తి కూడా అక్కడ అందుబాటులో ఉండాలి. ఇది పూర్తిగా ఉచితం. సర్వీస్ నచ్చితే టిప్ కూడా ఇవ్వొచ్చు. అది కస్టమర్ ఇష్టం.

**ఫిర్యాదుల పెట్టె**

పెట్రోల్ బంకుకు సంబంధించి ఏమైన అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. అందుకోసం ఫిర్యాదు పెట్టె అందుబాటులో ఉంచాలి. వినియోగదారులు ఫిర్యాదు, సలహాలు, సూచనలు రాసి ఆ పెట్టెలో వేయొచ్చు.

**నాణ్యత ప్రమాణాల తనిఖీ**

పెట్రోల్, డీజిల్ నాణ్యతపై అనుమానం కలిగితే అక్కడే చెక్ చేసుకోవచ్చు. ఇందుకు కావాల్సిన పరికరాలు, ఫిల్టర్ కాగితాలు కూడా బంకు సిబ్బందే ఇవ్వాలి. దీనితో పాటు పెట్రోల్, డీజిల్ తక్కువ పరిమాణంలో వస్తుందనిపించినా పరీక్షించుకోవచ్చు.

**ఫిర్యాదు ఎలా చేయాలి?**

బంకుల్లో నిబంధనల ప్రకారం ఈ సదుపాయాల్లో ఏ ఒక్కటి లేకపోయినా, బంకు సిబ్బంది వినియోగదారులతో దురుసుగా ప్రవర్తించినా కింది నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. చిరునామా, ఇతర సమాచారం ఇస్తే సంబంధిత చమురు సంస్థ వారిపై వెంటనే చర్యలు తీసుకుంటుంది.

**ప్రముఖ చమురు సంస్థల ఫోన్నెంబర్లు**

**భారత్పెట్రోలియం:1800224344**

**ఇండియన్ఆయిల్:1800233355**

**హెచ్పీసీఎల్:18002333555**

**రిలయన్స్: 18008919023.**

## ఎల్ఐసి ఏజెంట్ల ధర్నాలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**టీ మీడియా, మార్చి 19, పెద్దపల్లి బ్యూరో :** బుధవారం ఢిల్లీలోని రామ్లీలా మైదానంలో ఎల్ఐసి ఏజెంట్ల ధర్నాలో మద్దతు గా నిలిచిన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్లు మన దేశానికి హృదయం, వారు అహర్నిశలు శ్రమిస్తూ భారతీయ మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత అందిస్తున్నారు. లక్షలాది కుటుంబాల భవిష్యత్తు సురక్షితం కావడానికి వారు అంకితభావంతో పనిచేస్తున్నారు. వారి అమూల్యమైన సేవలను గుర్తించి, వారికి మద్దతు గా నిలిచిన అన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు పాలాభిషేకం



**టీ మీడియా, మార్చి 18, ఆత్మకూర్ :** ఆత్మకూరు మండల కేంద్రంలో గాంధీ చౌక్ నందు నిన్న అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్,ఎస్సీ వర్గీకరణ , బిల్లులకు ఆమోదం తెలిపినందున ఎస్సీ వర్గీకరణ తరపున, కాంగ్రెస్ పార్టీ బిసి విభాగల తరపున కృతజ్ఞతలతో ముఖ్యమంత్రి వర్యులకు, ఉపముఖ్యమంత్రి వర్యులు కు, మక్తల్ శాసనసభ్యులు శ్రీహరన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, పాలాభిషేకం చేయడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ చట్టసభలలో బిసి రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ వల్ల పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని, అదేవిధంగా రాజకీయంగా ఆర్థికంగా, ఎదగడానికి మంచి అవకాశమని, బిసి రిజర్వేషన్ పై, సుదీర్ఘంగా ప్రసంగించిన వాకిటి శ్రీహరి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్గొండ శ్రీనివాసులు, రాయచూరు పరమేష్, రహమతుల్లా తులసి రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు సాధించేవరకు బిజెపి పోరాడుతుంది

- ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా.కళ్యాణ్ నాయక్



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** ఖిల్లా ఘనపూర్ మండలం మామిడివాడ శివారులోని గిరిజన తండా వాసుల భూముల పట్టాల సాధనకై ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో భూముల పరిశీలనకై వచ్చిన ముఖ్యఅతిథి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు డా.కళ్యాణ్ నాయక్ జిల్లా అధ్యక్షులు డి నారాయణ తో కలిసి జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పాల్గొనడం జరిగింది. మాట్లాడుతూ వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం మామిడి మాడ శివారు సర్వే నెంబరు 339 లోని 463 ఎకరాల భూమి కొరకై వెనికి తండా, ముందరి తండా, మేడి బావి తండా, కర్నే తండా, ఆముదం బండ తండా, చిన్న పేరు తండా, మిత్యా తండా భీముని తండా తదితర ఎనిమిది గిరిజన గ్రామాలలో 70 యేళ్ళుగా సాగు చేస్తున్న భూముల పట్టాల కొరకై 150 గిరిజన కుటుంబాలు ఉద్యమం చేయడం చాలా బాధాకరంగా ఉందని ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు హామీలిచ్చి మోసం చేశారని గిరిజనులకు పట్టాలిప్పించే వరకుబిజెపి పార్టీ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు.గ. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు రవి నాయక్, బిజెపి జిల్లా అధికార ప్రతినిది మీడియా ఇన్చార్జి పెద్దిరాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రాజు నాయక్, తిరుపతి నాయక్, రామకృష్ణ నాయక్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, యువమోర్చా అధ్యక్షులు ఎద్దుల రాజు, ప్రధాన కార్యదర్శి నవీన్ చారి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఆగుపోగు చాణక్య, తదితరులు పాల్గొన్నారు.

## దొంగలు అరెస్టు

### జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** జలగరి ముత్తు ప్యాటగడ్డ,దుల్లోల . వీరు తాగుడుకు, జల్సాలు, కోడి పందేలు ఆడుటకు ఆడటం, ఇతర వ్యసనాలకు అలవాటుపడి త్వరగా ఎలాంటి కష్టం చేయకుండా డబ్బులు సంపాదించాలని తప్పుడు దారిలో గొర్రెల దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్ళిన సంఘటన పానగల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.గతంలో జైలుకు వెళ్ళిన సమయములో జైలులో జడ్చర్లకు చెందిన మూర్తి పరిచయమయ్యాడు. తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనం చేస్తే బంగారు, వెండి వస్తువులు, నగదు దొరుకుతాయి. బంగారు, వెండి వస్తువులను అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మించాడు. అతని మాటలకు ఆశపడిన నిందితులను పగటి పూట తాళం వేసి ఉన్న ఇళ్ళపై రెక్కి నిర్వహిస్తారు. పథకం ప్రకారం ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి వస్తువులు, నగదును దొంగిలించుకు పోవడం అలవాటుగా మార్చుకున్నారు.: 16 దొంగతనం కేసులు వనపర్తి జిల్లాలో,8 కేసులు ,నాగర్ కర్నూల్ జిల్లాలో వివిధ మండలాల్లో పాల్పడి బంగారు, వెండి, నగదులను దోచుకున్నారు. ఈ విధంగా దొచుకున్న సొమ్మును జల్సాలకు వినియోగించుకున్నారు. బొల్లిమోని అంజి , కిట్టు పరారి లో ఉన్నారు.5 తులాల బంగారం, 3 లక్షల రూపాయలు స్వాధీనం .నేరస్తులను పట్టుకుని, వారి నుండి నగదును బంగారు వస్తువులను స్వాదీనం చేసుకోవటానికి సహకరించిన పోలీసు అధికారులు,సిబ్బందిని సిసిఎస్ సీఐ, రవిపాల్, వనపర్తి సీఐ,కృష్ణ, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై, జలంధర్ రెడ్డి, చిన్నంబావి ఎస్సై, జగన్ వీపనగండ్ల ఎస్సై,రాణి,సిసిఎస్ఎస్సైలు,జయన్న, రామరాజు. ఏ ఎస్సై, తిరుపతి రెడ్డి , ఐటి కోర్ సిబ్బంది, గోవింద్ మురళి కానిస్టేబుళ్లు, మురళి,సమరసింహా రెడ్డి, అభిషేక్, రాజ మోహన్,నవీన్ గౌడ్, రాంగోపాల్ వర్మ, అశోక్,అరవింద్, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అభినందించి నగదు రివార్డు అందజేశారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతుల

-వివాహ వార్షికోత్సవ వేడుకలు





**టీ మీడియా, మార్చి 19, మేడ్చల్ :** మాజీ మంత్రి మల్లారెడ్డి దంపతుల 49వ వివాహ వార్షికోత్సవాన్ని బోయిన్పల్లిలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలు అభిమానులు ఏర్పాటుచేసిన కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి-కల్పన దంపతులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తన అంత అదృష్టవంతుడు మరొకరు లేరని ఆయన తెలిపారు. తన సతీమణి సహకారంతోనే విద్యాసంస్థలు నెలకొల్పి వ్యాపారాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు.



## ట్రాఫిక్ రూల్స్ గురించి ఎస్ ఐ అవగాహన

**టి మీడియా ,మార్చ్ 19 ,ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలో వాహనదారులకు ప్రయాణికులకు ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.మీటింగులో ప్రయాణికులు వాహనదారులకు క్రింది సూచనలు పాటించాలని చెప్పారు. ఆటోల లో పరిమితి నుంచి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, ప్రయాణికులు కూడా ఆటోలో పరిమితి నుంచి ప్రాయనించరాదని, తప్పనిసరిగా డాక్యుమెంట్స్ దగ్గర ఉంచుకోవాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, త్రిబుల్ రైడింగ్ చేయరాదు. తాగి వాహనాన్ని నడపరాదని, మైనర్లు అనగా చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నిడపరాదు. వాహనాలు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలి.పై విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఎస్సై నరేందర్ సిబ్బంది రవీందర్, బాలరాజు, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు సామాగ్రి వితరణ


**టీ మీడియా, మార్చి 19, చిన్నంబావి:** మండలలోని శివసాయి కమ్యూనికేషన్ సెంటర్ యజమాని జుర్రు పరుశురాం యాదవ్, మండలంలోని అయ్యవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్ను, పెన్సిల్, స్కేల్, ఎరేజర్, ఎక్సమ్ కిట్టును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఎవరైనా ఈ పబ్లిక్ పరీక్షలో 10/10,9.9 మార్క్స్ పర్సంటేజ్ సాధించిన వారికి మూడు వేల రూపాయలను బహుమతి అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు మంచిగా రాయాలని అందరికీ ఆల్ ద బెస్ట్ తెలియజేయడం జరిగింది. తాను చేసిన ఈ సహాయని ప్రోత్సహిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటు జుర్రు పరుశురాం యాదవ్, ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిన్నంబావి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ జగదీష్, యూత్ ఉపాధ్యక్షుడు విభీషణ్ యాదవ్, స్వామి, శంకర్ యాదవ్ , ప్రణవ్, శివ, యుగేందర్, అంజి, దేవేందర్, లోకేష్, టోని,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన



**టీ మీడియా,మార్చి 19, రామగుండం క్రైమ్:** రామగుండం పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైన్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో బుధవారం సిఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఉద్యోగులను యువతను మరియు స్థానిక ప్రజలను ఉద్దేశించి సైబర్ వలలో పడకుండా కొన్ని సూచనలు చేశారు ముఖ్యంగా మొబైల్స్ కు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి అడిగితే చెప్పవద్దు, తెలియని బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు,అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వాట్స్ యాప్ వీడియో కాల్ మాట్లాడవద్దు, ముఖ్యంగా లోన్ యాప్స్ మరియు ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ వలలో పడి అమూల్యమైన జీవితం నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసం జరిగి మీ డబ్బులు పోయినప్పుడు వెంటనే1930 కు ఫోన్ చేయాలి మరియు స్థానిక పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా గత కొద్ది రోజుల నుండి గుర్తు తెలియని దొంగలు తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్గా చేసి దొంగతనాలు చేస్తున్నారు, ఇంట్లో విలువైన వస్తువులు డబ్బు మరియు బంగారం ఉంచకూడదు,ఊరికి వెళ్ళినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్లో లేదా 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు, ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది రాసపల్లి రవికుమార్,రాజ్ కుమార్ రమేష్,ప్రదీప్ రెడ్డిలు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా డాక్టర్ డి కిరణ్మయి



**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా డాక్టర్ డి కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఐడిఓసి లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ కిరణ్మయి, గత మూడేళ్లుగా వనపర్తి ఎం సి హెచ్ లో ప్రొఫెసర్ ఆఫ్ అబ్ స్టేట్రిక్స్, గైనకాలజీ నిపుణులుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

# రాష్ట్ర బడ్జెట్ రాబడి అంచనాలు



- రాష్ట్ర సొంత పన్నుల రాబడి అంచనా రూ.1,45,419 కోట్లు
- బడ్జెట్‌లో ప్రతిపాదించిన రుణాలు రూ.69,639 కోట్లు
- కేంద్ర పన్నుల్లో వాటా రూ.29,899 కోట్లు
- పన్నేతర ఆదాయం అంచనా రూ.31,618 కోట్లు
- కేంద్రం నుంచి గ్రాంట్ల అంచనా రూ.22,782 కోట్లు
- జీఎస్డీపీలో అప్పుల శాతం 28.1గా అంచనా
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం అంచనా రూ.19,087 కోట్లు
- ఎక్సైజ్ శాఖ ఆదాయం అంచనా రూ.27,623 కోట్లు
- అమ్మకం పన్ను ఆదాయం అంచనా రూ.37,463 కోట్లు
- వాహనాలపై పన్ను ఆదాయం అంచనా రూ.8,535 కోట్లు
- ఈ ఆర్థిక ఏడాది ముగిసే నాటికి అప్పుల అంచనా రూ.5,04,814 కోట్లు

## మార్చి 2026 నాటికి

### -తెలంగాణ అప్పులు రూ.5,04,814 కోట్లు

### -ఆదాయంపై అంచనా లెక్కలు

**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర బడ్జెట్?ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ ఏడాది రాష్ట్రానికి వచ్చే ఆదాయం గురించి అంచనా లెక్కలు వేశారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి(మార్చి-2026) అప్పుల అంచనా రూ.5,04,814 కోట్లని తెలిపారు. రాష్ట్ర సొంత పన్నుల రాబడి రూ.1,45,419 కోట్లని అంచనా వేశారు. బడ్జెట్?లో ప్రతిపాదించిన రుణాలు రూ.69,639 కోట్లని, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.29,899 కోట్లు వస్తాయని వివరించారు.పన్నేతర ఆదాయం రూ.31,618 కోట్లని, కేంద్రం నుంచి గ్రాంట్లలో రూపంలో రూ.22,782 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఈ ఆర్థిక ఏడాది ముగిసే నాటికి అప్పుల రూ.5,04,814 కోట్లని తెలిపారు. జీఎస్డీపీలో అప్పుల శాతం 28.1, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల నుంచి వచ్చే ఆదాయం రూ.19,087 కోట్లని, ఎక్సైజ్ శాఖ నుంచి ఆదాయం రూ.27,623 కోట్లని, అమ్మకం పన్ను ఆదాయం రూ.37,463 కోట్లని, వాహనాలపై వేసే పన్నుతో రూ.8,535 కోట్ల ఆదాయం సమకూరుందని అంచనా వేశారు.

**పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటు**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ స్థూల రాష్ట్ర ఉత్పతి రూ.16,12,579 అని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 10.1 శాతం పెరిగిందని చెప్పారు. 2024-25 ఏడాది తలసరి ఆదాయం రూ.3,79,751 అని మంత్రి భట్టి వివరించారు. రాష్ట్ర తలసరి ఆదాయ వృద్ధిరేటు 9.6 శాతం అని పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కోట్లు కాగా దేశ తలసరి ఆదాయ వృద్ధిరేటు 8.8 శాతం అని తెలిపారు. దేశ తలసరి ఆదాయాన్ని పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం 1.8 రెట్లు ఎక్కువగా ఉందని వివరించారు.

## స్మితా సభర్వాల్‌కు నోటీసు జారీకి రంగం సిద్ధం?

### వాహనఅద్దెకు నిధులు తీసుకోవడంపై అభ్యంతరం




**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్‌కు నోటీసులు జారీ చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ రంగం సిద్ధం చేస్తోంది. ఇన్నోవా వాహనం అద్దె కింద తీసుకున్న నిధులను తిరిగి వర్సిటీకి చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొనుంది. ఒకటి రెండు రోజుల్లో ఆమెకు నోటీసులు జారీ చేయనున్నట్లుగా తెలుస్తోంది. గతంలో సీఎంఓలో అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న స్మితా సభర్వాల్ లేఖ మేరకు 2016 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు నెలకు రూ.63 వేల చొప్పున అద్దె రూపంలో వర్సిటీ నుంచి తీసుకున్నారు. రూల్స్‌నకు విరుద్ధంగా వాహనం అద్దె పేరిట 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడాన్ని ఆడిట్ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.విచారణలో పలు విషయాలు వెలుగులోకి స్మితా సభర్వాల్ అద్దెకు తీసుకున్నటువంటి టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు, ఎల్లో ప్లేట్ వాహనం కూడా కాదు. ప్రైవేటు వ్యక్తిగత వెహికల్ పవన్‌కుమార్ అనే వ్యక్తి పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో వెల్లడైంది. సీఎంవో స్మితా సభర్వాల్ ఆఫీస్ నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో విశ్వవిద్యాలయ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ పనితీరుపై ఇటీవల ఏజీ జరిపిన విచారణలో కొన్ని తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు వెల్లడయ్యాయి. అందులో ఈ అంశం కూడా ఉంది.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించనున్నాం : ఈ విషయంపై వివరణ కోరగా స్మితా సభర్వాల్ వాహన అద్దెపై ఆడిట్ అభ్యంతరం నిజమేనని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి ఆచార్య అల్దాస్ జానయ్య అన్నారు. ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ(ఇంటర్నల్? ఆడిట్), విశ్లేషణ జరిపించామని ఆయన స్పష్టం చేశారు. యూనివర్సిటీ పాలకవర్గం దృష్టికి తీసుకురావడం ద్వారా సమావేశంలో కూడా విస్తృతంగా చర్చించామని, ఈ విషయంపై సమగ్ర నివేదిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు, న్యాయనిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ వర్సిటీ వీసీ పేర్కొన్నారు.

## పాలిటెక్నిక్ కోర్సుల్లో భారీగా పెరిగిన ఫీజు

### - గరిష్ఠంగా రూ.39 వేలకు , జీఓ 38 జారీ



**టి మీడియా, మార్చి 19, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల ఫీజు భారీగా పెరిగింది. గత దశాబ్దకాలంగా అధికారికంగా రూ.14,900గా ఉండగా ఇప్పుడు 2023-24, 2024-25లతో పాటు వచ్చే విద్యా సంవత్సరానికి గరిష్ఠ ఫీజు రూ.39 వేలకు చేరింది. తెలంగాణలోని 55 ప్రైవేట్ కళాశాలలకు ఫీజు నిర్ణయించగా అందులో 43 కాలేజీలకు రూ.39 వేలు ఫీజు ఉండటం గమనార్హం. మరికొన్ని కాలేజీలకు రూ.25 వేల నుంచి రూ.35 వేలుగా నిర్ణయించారు. కేవలం రెండు కళాశాలలకే రూ.14,900, రూ.15 వేలుగా ఫీజు నిర్ణయించారు. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీజీఏఎఫ్ఆర్సీ) ఫీజులను నిర్ధారించి, ప్రభుత్వానికి పంపిన నేపథ్యంలో ప్రభుత్వం జీఓ 38ని జారీ చేసింది.తాజా పరిస్థితులకు అనుగుణంగా : దశాబ్దకాలంగా ఫీజులు పెంచలేదని, తాజా పరిస్థితులకు అనుగుణంగా రుసుమును నిర్ణయించాలని 2023-24 విద్యా సంవత్సరంలో కొన్ని కాలేజీల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. దాంతో వాటికి టీఏఎఫ్ఆర్సీ ఫీజులు నిర్ణయించాలని, ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆయా కాలేజీలు రూ.40 వేల ఫీజు వసూలు చేసుకోవచ్చని కోర్టు తీర్పునిచ్చింది. అయితే, రుసుములు ఖరారు చేయాలన్న ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ఫీజుల కమిటీ సైతం మిన్నకుండిపోయింది.ఎలాంటి కదలిక లేదు : ప్రస్తుత విద్యా సంవత్సరం(2024-25) ప్రవేశాలు మొదలయ్యే వరకు ఎలాంటి కదలిక లేదు. దాంతో మళ్లీ పలు కళాశాలలు హైకోర్టుకు వెళ్లి, న్యాయస్థానం తీర్పుతో ఈ ఏడాదీ రూ.40 వేలు వసూలు చేశాయి. కాకపోతే కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో మాత్రం అన్ని ప్రైవేట్ కాలేజీలు రూ.14,900 మాత్రమే ఫీజు ఉన్నట్లు చూపారు. మిగిలిన మొత్తాన్ని ఆయా కళాశాల విద్యార్థుల నుంచి వేరుగా వసూలు చేశాయి.ఈ క్రమంలో కొద్ది నెలల క్రితం టీఏఎఫ్ఆర్సీ ఫీజులను నిర్ధారించి ప్రభుత్వానికి సిఫార్సు చేయడంతో అందుకనుగుణంగా విద్యాశాఖ ఇటీవల జీఓ జారీ చేసింది. ఈ ఫీజులు 2023-24, 2024-2025లతోపాటు వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) కూడా వర్తిస్తాయని పేర్కొంది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.14,900 మాత్రమే చెల్లిస్తోంది. రాష్ట్రంలో ప్రతేడాది డిప్లొమా కోర్సుల్లో సుమారు 30 వేల మంది ప్రవేశాలు పొందుతున్నారు.

# ఖనిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలి

### -ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య




**టీ మీడియా,మార్చి 19,గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి సంస్థ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక పవర్ హౌస్ కాలనీలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడున్న నిరుద్యోగ యువతతో గ్రంథాలయ సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ... రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాదిమంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న వారికి సరిపడే వసతులతో కూడిన లైబ్రరీ పారిశ్రామిక ప్రాంతంలో లేదని అవేదన వ్యక్తం చేశారు.కేవలం అరకొర వసతులతో సింగరేణి క్వార్టర్లో అద్దె ప్రాతిపదికన లైబ్రరీ నడుస్తుందని దీన్నిబట్టే ప్రభుత్వానికి,సింగరేణి సంస్థకు నిరుద్యోగ యువత పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో కనబడుతుందని అన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వం కలిసి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీని అన్ని వసతులతో కూడిన భవంతిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనేక సింగరేణి మరియు ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని వాటిలో లైబ్రరీ నిర్మాణానికి అనుగుణంగా ఉన్న స్థలంలో నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడో సివిల్స్ కు సెలెక్ట్ అయిన విద్యార్థులకు సింగరేణి నిధులనుండి తలా లక్ష రూపాయలు ఇస్తున్న సింగరేణి కి సింగరేణి కార్మికుల పిల్లల భవిష్యత్తు పట్టదా అని ప్రశ్నించారు. రామగుండం ఎమ్మెల్యే ఆర్జీ.వన్ జీఎం చొరవ తీసుకొని వెంటనే సింగరేణి సిఎస్ఆర్ నిధులనుండి పారిశ్రామిక ప్రాంతానికి లైబ్రరీ కోసం నిధులు మంజూరు చేసి అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధంగా నూతన లైబ్రరీని వెంటనే నిర్మించాలని లేనిపక్షంలో నిరుద్యోగ యువతతో జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.అలాగే గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులతో మాట్లాడినప్పుడు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని సరియైన స్టడీ మెటీరియల్ స్టడీ పాడ్స్ వంటి సౌకర్యాలు లేవని అలాగే లైబ్రరీ చుట్టూ కొంత చెట్లు ఉండడం వల్ల పరిశుభ్రంగా లేదని ఈ సమస్యలన్నింటినీ కూడా జీఎం దృష్టికి తీసుకుపోతామని సూర్య వారికి వివరించారు.ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సురేందర్,రాణవేణి సుధీర్ కుమార్,పోతరాజు నాగరాజు నాగరాజు, వినయ్,సాయి పాల్గొన్నారు.



## కవిత్వంతో లక్షలాది మంది ప్రభావితం

### -సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి

**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిక్కొండ్ర రవి రచించిన " వీరనాగు" శతకంను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బుద్దారం గ్రామములో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కొండ్రా రవి చిన్న వయసులో గ్రామీణ ప్రజల జీవన విధానం సామాజిక అసమానతలను, జీవకోటికి ప్రాణమైన నీళ్ళను సాహిత్యంగా తీసుకొని వీరనాగు శతకం రచించడం అభినందనీయం అని అన్నారు.చిన్ననాటి నుండి తాను పెరిగిన పరిస్థితులను గ్రామీణ ప్రజల కష్టాలను క్లుప్తంగా చూస్తూ ఒకనాడు వర్షంపై ఆధారపడే వ్యవసాయాన్నిచూసి చలించిపోయిన నేను అపర భగీరథ ప్రయత్నంతో కృష్ణ జలాలు తీసుకొచ్చిన వైనాన్ని రవి వివరించారని కొనియాడారు. వీరనాగు శతకం సామాజిక శతకంగా చరిత్రలో నిలిచి పోతుందని అన్నారు. సాధారణంగా ఆవిష్కరణలో సాధారణ స్థితిలో జరుగుతాయని కానీ ఈరోజు తాను పుట్టిపెరిగిన గ్రామం ప్రజల మధ్యన ఆవిష్కరించడం అభినందనీయం అని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో వనపట్ల. సుబ్బయ్య, మాదిరే. మల్లమ్మ, డాక్టర్.శిఖామణి, డాక్టర్.కోటేశ్వరరావు, నాగవారం బాలరాం, రామ్మూర్తి, అమర్నాథ్, వహీద్ ఖాన్, విప్లావ్ తదితరులు పాల్గొన్నారు.



## భూమ్మీదకు వచ్చిన సునీతా విలియమ్స్

### -నెక్ట్ ప్లాన్ వివరాలు ..?

**టీ మీడియా, మార్చి 19, ఢిల్లీ :** కేవలం ఎనిమిది రోజుల్లోనే పూర్తి కావాల్సిన సునీతా విలియమ్స్అంతరిక్షయానం సాంకేతిక కారణాల వల్ల సుదీర్ఘ కాలం అక్కడే ఉండిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. దాదాపు 9 నెలల తర్వాత అంతరిక్ష కేంద్రంలో ఉన్న ఆమె ఎట్టకేలకు భూమ్మీదకు వచ్చారు. ఇప్పుడు ఆమె ఏం చేస్తారు అనేది అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత సంతతి వ్యోమగామి సునీతకు సంబంధించి కొన్ని ఆసక్తికరమైన విషయాలు గురించి చూద్దాం.భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అమెరికాలోని ఒహియో రాష్ట్రంలో 1965లో జన్మించారు. ఆమె తండ్రి దీపక్ పాండ్య గుజరాత్‌లోని జులాసన్ గ్రామానికి చెందినవారు. 1957లో ఆయన అమెరికాకు వలస వెళ్లారు. న్యూరో శాస్త్రవేత్తగా ఆయన అక్కడ స్థిరపడ్డారు. దీపక్ పాండ్య దంపతులకు ముగ్గురు సంతానం కాగా సునీతా చివరి సంతానం. 1987 మేలో అమెరికా నావికా దళంలో చేరిన ఆమె, ఆరు నెలల అనంతరం బేసిక్ డైవింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. తర్వాత 1989లో నేవల్ ఎయిర్ ట్రైనింగ్ కమాండ్‌లో నేవల్ ఏవియేటర్‌గా చేరారు. నేవల్ ఏవియేటర్‌గా యుద్ధ విమానాలు నడపడంలో ఆమె శిక్షణ పొందారు. నేవీ నుంచి రిటైరయ్యాక 1998 అగస్టులో జాన్సన్ స్పేస్ సెంటర్‌లో వ్యోమగామిగా శిక్షణ తీసుకున్నారు.

### అంతరిక్షంలోకి భగవద్గీత


2006లో తొలిసారి అంతరిక్ష యాత్ర చేశారు. అంతరిక్ష కేంద్రంలో 195 రోజుల పాటు గడిపి దాని నిర్వహణ, మరమ్మతులు తదితరాలపై అనుభవం గడించారు. ఆ సమయంలోనే ఆమె భగవద్గీతను అంతరిక్ష కేంద్రంలోకి తీసుకెళ్లారు. 2012లో రెండోసారి అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన ఆమె 127 రోజులు అక్కడే ఉన్నారు. రెండో సారి వెళ్లినప్పుడు ఓం చిహ్నంతో పాటు ఉపనిషత్తులను ఐఎస్ఎస్‌కు పట్టుకెళ్లారు. అత్యధిక సమయం స్పేస్‌వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా సునీతా విలియమ్స్ ఘనత వహించారు. ఆమె తన కెరీర్‌లో 62 గంటల 6 నిమిషాల పాటు అంతరిక్షంలో స్పేస్ వాక్ చేశారు. ఎక్కువ సమయం పాటు స్పేస్ వాక్ చేసిన వారిలో మొత్తంగా సునీతా విలియమ్స్ నాలుగో స్థానంలో ఉన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో మారథన్ రన్ చేసిన తొలి వ్యక్తిగా ఆమె రికార్డు సృష్టించారు. 2007లో ఐఎస్ఎస్‌లో ఆమె ట్రెడ్ మిల్‌పై మారథన్ రన్ చేశారు. అమెరికా సైన్యానికి సంబంధించి నాలుగు అవార్డులు పొందిన ఆమె అంతరిక్షంలో విశేష సేవలందించినందుకు గాను నాసా స్పేస్‌ఫ్లైట్ మెడల్‌ను పొందారు. 2008లో భారత ప్రభుత్వం పద్మ భూషణ్ పురస్కారంతో ఆమెను సత్కరించింది. అవార్డులతో పాటు పలు సంస్థల్లో ఆమె సభ్యురాలిగా ఉన్నారు. అమెరికా హెలికాప్టర్ అసోసియేషన్, సొసైటీ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్స్ సహా ఇతర సంస్థల్లో సభ్యురాలిగా ఉన్నారు.

### ప్లాన్ ఇదే

సునీతా విలియమ్స్‌ను అమెరికాలో సునీ, స్లొవేనియాలో సోంకా అనే పిలుస్తారట. 20 ఏళ్ల క్రితం ఫెడరల్ మార్షల్ మైఖల్ జె విలియమ్స్‌ను వివాహమాడారు సునీత. కెరీర్ తొలినాళ్లలో ఇద్దరు హెలికాప్టర్ పైలట్లుగా పనిచేశారు. టెక్సాస్‌లోని హూస్టన్‌లో నివసిస్తున్న వీరికి సంతానం లేదు. అహ్మదాబాద్‌కు చెందిన ఓ బాలికను దత్తత తీసుకోవాలనే కోరికను మాత్రం ఆమె 2012లో వెలిబుచ్చారు. రెండు కుక్కలను పెంచుకుంటున్న సునీతా దంపతులు వాటితోనే ఎక్కువ సమయం గడుపుతామని ఓ సందర్భంలో చెప్పారు. అంతరిక్షంలో చిక్కుకున్న సమయంలో పెట్‌డాగ్స్‌ను మిస్సవుతున్నానని ఆమె ఓ సందర్భంలో భావోద్వేగానికి గురయ్యారు.తొలి అంతరిక్ష యానం పూర్తవగానే సునీతా విలియమ్స్ భారత్‌ను సందర్శించారు. 2007 సెప్టెంబర్‌లో ఆమె గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమంతో పాటు స్వగ్రామం జులాసన్‌ను సందర్శించారు. జులాసన్‌లో పాఠశాలకు విరాళం కూడా ఇచ్చారు. ఆ సమయంలోనే ఆమె దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలుసుకున్నారు. అనంతరం 2013లో రెండో అంతరిక్ష యానం పూర్తవగానే సునీతా మరోసారి భారత్‌ను సందర్శించారు. మూడోసారి విజయవంతంగా అంతరిక్ష యాత్ర పూర్తి చేసిన సునీతా ఈ దఫా కూడా భారత్‌ను సందర్శిస్తారమో వేచి చూడాలి.

## త్వరలోనే ఇండియాకు సునీతా విలియమ్స్

### - 'భారత పుత్రిక'కు ప్రముఖుల స్వాగతం



**టీ మీడియా, మార్చి 19, ఢిల్లీ :** దాదాపు తొమ్మిది నెలల తర్వాత అంతరిక్షం నుంచి భూమికి తిరిగి వచ్చిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ త్వరలో భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆమె బంధువు ఒకరు ఈ విషయాన్ని ప్రకటించారు. సునీత సురక్షితంగా భూమిపై అడుగు పెట్టడం వల్ల గుజరాత్‌లోని పూర్వీకుల గ్రామం ఝులాసన్‌లో ఆమె బంధువులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సునీత బంధువు ఒకరు మీడియాతో మాట్లాడుతూ ఆమె త్వరలోనే భారత్‌కు వస్తుందని తెలిపారు.సునీత కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాం. ఆమె భూమిపై దిగిన క్షణాలు అపురూపం. అంతా సాఫీగా సాగినందుకు ఆనందంగా ఉంది. ఎలాంటి సవాళ్లనైనా ఆమె ఎదుర్కోగలదు. మా అందరికీ ఆమె ఆదర్శం. ఇప్పుడంతా సునీతకు ఫ్యామిలీ టైమ్. మేమంతా కలిసి వెకేషన్ ప్లాన్ చేస్తున్నాం. సునీత అంతరిక్షంలో ఉన్నప్పుడు కూడా మేం ఆమెతో టచ్‌లోనే ఉన్నాం. ఇటీవల నేను మహాకుంభమేళాకు వెళ్లగా ప్రయాగ్ రాజ్ విశేషాలను ఆ విశేషాలను రోదసి నుంచే అడిగి తెలుసుకున్నారు' అని సునీతా బంధువు ఫాల్గుణి తెలిపారు.

సునీతాకు ప్రముఖుల వెల్‌కమ్

దాదాపు తొమ్మిది నెలల తర్వాత భూమ్మీదకు తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌పై యావత్? ప్రపంచం స్వాగతం పలుకుతోంది. ఈ సందర్భంగా భారత్‌లో పలువురు కేంద్రమంత్రులు వ్యోమగాములకు స్వాగతం చెబుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌లు చేశారు.భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి చేరుకోవటం చాలా సంతోషం. నాసా వ్యోమగాములు విజయవంతంగా భూమికి చేరటానికి కృషిచేశారు. సునీత, ఇతర వ్యోమగాముల పట్టుదల, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి. వారి చారిత్రాత్మక యాత్ర సంకల్పం, టీమ్ వర్క్, అసాధారణ ధైర్యానికి ప్రతీక' - ద్రౌపదిముర్ము, రాష్ట్రపతి

## గల్ఫ్ వెళ్లినా...

# అప్పులతోనే సావాసం

అందక చివరకు జైలు పాలవుతున్నారు.కంపెనీ వీసాలపై వెళ్లినవారు తక్కువ వేతనం కారణంగా బయట ఇతర పనులతో కాలం వెళ్లదీస్తున్నారు. వీసాలకు డబ్బులు ఎక్కువగా చెల్లించటం, ప్రమాద బీమా లేకపోవటం వంటి కారణాలతో చాలామంది అప్పులతోనే జీవనం వెళ్లదీస్తున్నారు. ప్రమాదాలు, అనారోగ్యం తదితర కారణాలతో చాలామంది మరణిస్తుండగా పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం కలవరపెడుతోంది.

**ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలి :**

విదేశాలకు వెళ్లే వారికి నిబంధనలపై అవగాహన కల్పించేందుకు, నకిలీల బెడద అరికట్టేందుకు గతంలో కేంద్రం ఓవర్సీర్ మ్యాన్‌పవర్ రిక్రూట్‌మెంట్ సంస్థను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ పనితీరు బాగోలేక కార్మికులకు సరైన సమాచారం దొరకనందున ఇకనైనా ఆ సంస్థ సేవలను విస్తృతం చేయాలి.

కేంద్రం విదేశీ కంపెనీలతో మధ్యవర్తిత్వం వహిస్తూ యువతను విదేశాలకు పంపించేలా చొరవ తీసుకుంటే మోసాలు తగ్గుతాయి.విదేశాల్లో సంక్షోభం ఏర్పడినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున ప్రతినిధుల బృందం వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. జైళ్లలో మగ్గుతున్నవారికి ప్రభుత్వం న్యాయ సహాయం అందించాలి.

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని టామ్‌కామ్ సంస్థ సేవలను విస్తృతంచేసి యువతను కంపెనీల్లోకి నేరుగా పంపించేలా చూడాలి.యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి విదేశాలకు పంపిస్తే తగిన వేతనం పొందగలుగుతారు.అర్ధాంతరంగా తిరిగొచ్చిన కార్మికులకు ప్రభుత్వం పరిహారం, ఉపాధి కల్పన తదితర చర్యల ద్వారా ఆదుకోవాలి.నకిలీ ఏజెంట్ల కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలి. ఎన్నారై పాలసీపై స్పష్టమైన విధానాలు ప్రకటించి అమలు చేయాలి. ఇమిగ్రేషన్ విధానాన్ని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలి.గాయపడ్డ వారికి చికిత్స, మృతదేహాలను తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేయాలి. వాళ్లు పని చేసిన కంపెనీల ద్వారా కుటుంబాలకు పరిహారం వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

## అసెంబ్లీ సాక్షిగా అబద్దాల చిట్టా

### -మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**టీ మీడియా, మార్చి 19, వనపర్తి బ్యూరో :** ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్, బడ్జెట్ ప్రసంగంలా లేదు అని రాజకీయ ప్రసంగంలా ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి .నిరంజన్ రెడ్డి విమర్శించారు.ఇది బడ్జెట్ ప్రసంగమా ? రాజకీయ ప్రసంగమా ?అసెంబ్లీ సాక్షిగా అబద్దాల చిట్టా ఆర్థికమంత్రి చదివారు అని నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనా వికాసాన్ని15 నెలల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం చేశారు . 15 నెలల పాలన పాపం ఫలితంగా 450 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.విద్యారంగంలో కాంగ్రెస్ 15 నెలల పాలన విధ్వంసం రేపింది . గురుకుల పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు వివిధ కారణాలతో మరణించారు.ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, కేసీఆర్ పాలనలో పూర్తయిన పరీక్షల ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందించి మేమే ఇచ్చాం అని గొప్పలు చెప్పుకుంటున్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో వెలుగులు మాయమై చీకట్లు అలుము కున్నాయి .కేవలం 15 నెలలలో రూ.లక్ష 58 వేల కోట్లు అప్పులు చేసి ఒక్క పథకం అమలు చేయలేదు.ఒక్కప్రాజెక్టుపూర్తిచేయలేదు. బడ్జెట్ప్రసంగంనిండాఅన్నీఅబద్దాలేవండివార్చారు.ధ్వంసం, విధ్వంసమే కాంగ్రెస్ రచన నవ నిర్మాణాన్ని నరనరాన నింపుకుని పనిచేసిన కేసీఆర్ సర్కార్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు అని రాష్ట్ర బడ్జెట్ పై మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

## గ్రంథాలయంలో ఉద్యోగాల పంట


### - చక్కటి ర్యాంకులతో విద్యార్థులు





**టీ మీడియా, మార్చి 19, భద్రాద్రి కొత్తగూడెం:** గ్రంథాలయం పై ఆధారపడి చదివిన విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్ష ఫలితాల్లో ఇద్దరు చక్కటి ర్యాంకులు సాధించి ఉత్తమ ఫలితాన్ని కైవసం చేసుకున్నారు.జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెం నందు గత మూడు సంవత్సరాలుగా గ్రంథాలయంలో వినియోగించుకుని వెలువడిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లలో రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంకుతో జోనల్ స్థాయిలో 18వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో భారీ లక్ష్మణ్ యాదవ్ మరియు రాష్ట్రస్థాయిలో 25 ర్యాంకుతో జోనల్ స్థాయిలో 35 ర్యాంక్ తో ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందిన సతీష్ శ్రీలత యాదవ్ ఉద్యోగం పొందారు. ఈ ఫలితాన్ని ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని జిల్లా కార్యదర్శి అర్జున్ గారు అన్నారు. విద్యార్థుల కృషి పట్టుదల అమోఘం అని వీరు ఉద్యోగం సాధించడం కొత్తగూడెం జిల్లా గ్రంథాలయకే గర్వకారణం అని వీరు ఉద్యోగానికి పొందడానికి గ్రంథాలయంలో ఏర్పాట్లతో సహాయ సహకారాలు అందించిన గ్రంథ పాలకురాలు మణి మృదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు మూడు సంవత్సరాల గ్రంథాలయమును వినియోగించుకున్నామని ఎటువంటి కష్టం వచ్చినా గ్రంథపాలకురాలు తక్షణమే చర్యలు తీసుకొని సహాయ సహకారాలు అందించారని వారు ప్రోత్సాహంతోనే ఉద్యోగం పొందాలని ఇందుకు మేము జిల్లా గ్రంథాలయ సంస్థకు రుణపడి ఉన్నామాటు ఉద్యోగం సాధించిన ఇరువురు తెలియజేశారు

## అనర్హుల రేషన్ కార్డులు రద్దు చేయండి: సుప్రీం



**టీ మీడియా, మార్చి 19, ఢిల్లీ :** దేశంలోని చాలా రాష్ట్రాల్లో రేషన్ కార్డులు దుర్వినియోగం అవుతున్నాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పేదలు అనుభవించాల్సిన ఫలాలు ధనికులు అనుభవిస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. వెంటనే అనర్హుల రేషన్ కార్డులను రద్దు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, ఎన్. కోటీశ్వర్ సింగ్లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. దేశంలో దాదాపు 80 శాతం మంది నిరుపేదలు ఉన్నారని, వారందరికీ ఆహార భద్రత ఎంతో అవసరమని పేర్కొంది.